
హయత్‌నగర్ డివిజన్‌లోని బంజారాకాలనీలో బంజారా భవన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

బంజారాకాలనీని అభివృద్ధి చేస్తా: నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని బంజారా కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. బంజారాకాలనీలో రూ.50లక్షలతో చేపడుతున్న బంజారా భవన్ పనులను శనివారం కాలనీ ప్రజలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. బంజారా భవన్‌ను నాణ్యతతో నిర్మించి అందించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు బండారు భాస్కర్, డివిజన్ అధ్యక్షుడు శ్రీను, పారంద మహేష్, కాంగ్రెస్ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, సత్యనారాయణ, రఘుపతినాయక్, బాలు నాయక్, శ్రీకాంత్, నర్సింహ, పంతు, గోవర్ధన్, అంజమ్మ, శంకర్ పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అరుణారెడ్డి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సైదాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో పేరుకుపోయిన ప్రజాసమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కారానికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ కొత్త కాపు అరుణారెడ్డి తెలిపారు. శనివారం జీపీ-1 కాలనీలో రూ.16లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. డివిజన్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా మాస్టర్‌ప్లాన్ రూపొందించానని వివరించారు. కాలనీ ప్రతినిధులు రామకృష్ణ, రమేష్‌కుమార్, ఆనంద్, జగన్, సుధీర్, విక్రం పాల్గొన్నారు.

పార్కులను సుందరీకరణ చేసుకోవాలి: లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పార్కులను సుందరీకరణ చేసుకోవాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్ కాలనీలోని పార్కును శనివారం కార్పొరేటర్ పరిశీలించారు. పార్కులోని సమస్యలను కాలనీవాసుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పార్కును పరిశుభ్రంగా తీర్చిదిద్దుకోవడానికి వాకర్స్, కాలనీవాసులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు, వాకర్స్ పాల్గొన్నారు.


సచివాలయనగర్ పార్కులో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

భక్తిశ్రద్ధలతో మండల పూజ

కొత్తపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట నాగేశ్వర్‌నగర్ కాలనీలోని దాసాంజనేయస్వామి ఆలయంలో శివపంచాయతన, వేద దక్షిణామూర్తి, శ్రీలక్ష్మి సమేత హయగ్రీవస్వామి వార్లకు శాస్త్రోక్తంగా మండల పూజ నిర్వహించారు. కార్పొరేటర్ పవన్‌కుమార్ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, బీజేపీ నాయకులు మంచి రాజేష్, తోట మహేందర్‌యాదవ్, రాకేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


మండల పూజలో కార్పొరేటర్ పవన్‌కుమార్

ఘనంగా మహాకుంభాభిషేక పూజలు

ఓల్డ్‌మలక్‌పేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో కొలువై ఉన్న గరుడ అభయాంజనేయస్వామి మహాకుంభాభిషేక పూజలు ఘనంగా జరుగుతున్నాయి. వేదబ్రాహ్మణులు మంత్రోచ్ఛరణలో మార్కెట్ ఆవరణ మొత్తం మారుమ్రోగుతుంది. రెండోరోజు శనివారం గరుడ ప్రార్థన, వేదస్వస్తి, మంటప ఆవాహిత పూజలు మన్యుసూక్త పారాయణం నీరాజనం, మంత్రపుష్పం పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమాల్లో మార్కెట్ ట్రేడర్లు, వ్యాపారులు, మార్కెట్ ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.


మార్కెట్‌లో పూజలు చేస్తున్న దృశ్యం

ఘనంగా బంగారు మైసమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ

సైదాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఉప్పరిగూడ ఛావునిలోని బంగారు మైసమ్మ ఆలయ పునర్నిర్మాణ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ వేడుకల్లో మొదటి రోజు గణపతిపూజ, అగ్నిప్రతిష్ఠాపన, జలాధివాసం వంటి ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అన్నప్రసాద వితరణ, మంగళవారం ఉదయం అమ్మవారికి బోనాల సమర్పణ కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు సభ్యులు వివరించారు.


ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు

ఘనంగా ఆలయ బ్రహ్మోత్సవాలు

ఎల్బీనగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురం డివిజన్ సౌభాగ్యపురంకాలనీలోని అలివేలుమంగ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ చతుర్దశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగిన స్వామివారి కల్యాణోత్సవంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధురఉపేందర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో ఆలయ చైర్మన్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ రమణయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, కోశాధికారి మూర్తి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.


వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో కాంగ్రెస్ నాయకుడు మధురఉపేందర్‌రెడ్డి దంపతులు

బీజేపీ హస్తినాపురం డివిజన్ కమిటీ నియామకం

చంపాపేట : బీజేపీ హస్తినాపురం డివిజన్ నూతన కమిటీని నియమించినట్లు పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎరుకల మల్లేష్‌గౌడ్ తెలిపారు. బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శులుగా డి.అమర్‌నాథ్‌రెడ్డి, గౌని.వెంకటేష్‌గౌడ్, కోశాధికారిగా సాయికృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం.అరుణ మెల్కోటి, కె.శేఖర్‌గౌడ్, కె.శ్రీనివాస్‌రెడ్డి, పి.జీవన్‌రెడ్డి, కార్యదర్శులుగా ఇంద్రావతి నీల, ఎస్.గోవర్ధన్‌యాదవ్, శ్రీకాంత్‌గౌడ్, చంద్రకాంత్, 34మంది కార్యవర్గ సభ్యులను నియమించినట్లు పేర్కొన్నారు.


సరూర్‌నగర్ ఈద్గా వద్ద బక్రీద్ ప్రార్థనల్లో ముస్లింలు


ప్రార్థన చేస్తున్న మలక్‌పేట ఎమ్మెల్యే బలాల


మాజీ హోంమంత్రి మహమూద్‌అలీకి ఈద్‌ముబారక్ తెలియజేస్తున్న స్థానికుడు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

చాదర్‌ఘాట్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధల నడుమ శనివారం ఘనంగా జరుపుకున్నారు. మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ ఆజంపురలోని ఏక్‌మినార్ మసీద్‌లో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేయగా, కాంగ్రెస్ మలక్‌పేట ఇన్‌చార్జి షేక్ అక్బర్ ఎన్టీఆర్‌నగర్‌లోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పలువురికి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

మూసారాంబాగ్ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు

మూసారాంబాగ్‌లోని ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ నరేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్ర శాంతి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారాయణరెడ్డి, కార్యదర్శి ముప్పిడి బల్వంత్, దీపక్‌లతో కూడిన బృందం మలక్‌పేట, చాదర్‌ఘాట్ పోలీసులతో కలిసి పలు చోట్ల పర్యటించారు. మత సామరస్యానికి ప్రతీకగా పండుగలు జరుపుకోవాలని వారు సూచించారు.

ఎల్బీనగర్ : సరూర్‌నగర్ ఈద్గా వద్ద ముస్లింలు సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గావద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలకు రాజకీయ నాయకులతో పాటు పోలీసులు శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సైదాబాద్, అక్బర్‌బాగ్‌లలో..

సైదాబాద్ : అక్బర్‌బాగ్, మాదన్నపేట ఈద్గాలు, సైదాబాద్‌లోని ప్రార్థన మందిరాలలో వేలాది మంది ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం మతపెద్దలు బక్రీద్ నేపథ్యాన్ని వివరించారు. ఒకరినొకరు అలింగనం చేసుకుని ఈద్‌ముబారక్ తెలుపుకున్నారు. అక్బర్‌బాగ్ ఈద్గాలో ఎమ్మెల్యే అహ్మద్ బలాల ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు.

వనస్థలిపురం: డివిజన్‌లోని జాంగీర్‌నగర్ కాలనీలోని మసీద్‌లో కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. మసీద్ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

హయత్‌నగర్, తుర్కయంజాల్‌లలో..

హయత్‌నగర్: హయత్‌నగర్, తుర్కయంజాల్ పరిసర ప్రాంతాలకు చెందిన ముస్లింలు హయత్‌నగర్‌లోని చిన్న మసీదు, హయత్‌బక్షీ మసీదు, మదర్సాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇంజాపూర్‌లోని మసీదును ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ధన్‌రాజ్‌గౌడ్‌లు సందర్శించి ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేద ముస్లింలకు మటన్‌ను పంపిణీ చేశారు. గ్రామాల్లో ముస్లింలకు పలువురు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.


ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి


ఇంజాపూర్‌లో ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇళ్ల కేటాయింపులో న్యాయం జరిగే వరకు పోరాటం

- మాజీ ఎంపీ అజీజ్‌పాషా

చంపాపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కింద ఇళ్ల కేటాయింపులో స్థానికులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేయనున్నట్లు మాజీ ఎంపీ, సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని నందనవనంలో శనివారం బలహీనవర్గాల సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా అజీజ్ పాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకంలో స్థానికులకు ఇళ్లు కేటాయించకపోవడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు, పోలీసులు వచ్చి బలవంతంగా ఇళ్లు ఖాళీ చేయించడం కోసం చేసే ప్రయత్నం విరమించుకోవాలని కోరారు. అవసరమైతే కోర్టుకు వెళ్లనున్నట్లు అన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌సీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఆర్.గోపాల్, నాయకులు ఎండీ.మహబూబ్, స్థానికులు పాల్గొన్నారు. అనంతరం స్థానికులతో కలిసి అజీజ్‌పాషా బక్రీద్ వేడుకల్లో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ అజీజ్‌పాషా

సమస్యల పరిష్కారమే సీపీఐ ఎజెండా: రవీంద్రాచారి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ఎజెండాగా సీపీఐ పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి అన్నారు. శనివారం మండలంలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో నిర్వహించిన ఆ పార్టీ గ్రామశాఖ మహాసభకు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డితో కలిసి రవీంద్రాచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికారంలో ఉన్నా.. లేకున్నా నిరంతరం పేదల పక్షాన పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ సీపీఐ మాత్రమే అన్నారు. ఈసందర్భంగా గ్రామశాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా యాదగిరితో పాటు 14మందితో కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బతి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ హరిసింగ్‌నాయక్, వేణుగోపాలచారి, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీపీఐ గ్రామశాఖ మహాసభలో రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు

ఆలయ చైర్మన్‌గా సత్యనారాయణరెడ్డి బాధ్యతల స్వీకరణ

చంపాపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయ పాలకమండలి చైర్మన్‌గా హస్తినాపురం డివిజన్ రెడ్డికాలనీకి చెందిన ఈదులకంటి సత్యనారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆలయంలో చైర్మన్ చాంబర్‌లో శనివారం చైర్మన్ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ధర్మకర్తలతో నిర్వహించిన సమావేశానికి రంగారెడ్డి జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈవో ఎన్.లావణ్య హాజరయ్యారు. ఈదులకంటి సత్యనారాయణరెడ్డిని చైర్మన్‌గా ధర్మకర్తలు నారాయణ్ దుర్గారెడ్డి, దిండు ప్రవీణ్‌గౌడ్ బలపరచగా తోటి ధర్మకర్తలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం చైర్మన్‌ను పలువురు ఘనంగా సన్మానించారు. చైర్మన్ మాట్లాడుతూ తోటి ధర్మకర్తలు, దేవాదాయశాఖ అధికారులు, ఆలయ ఈవో, దాతలు, భక్తుల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. తనను చైర్మన్‌గా నియమించినందుకు గాను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు ఎనుముల రవీందర్‌రెడ్డి, కుకునూరి గోపాల్‌రెడ్డి, జె.విష్ణువర్ధన్‌రెడ్డి, తోకటి కిరణ్‌కుమార్, సింగంశెట్టి శ్రీనివాస్, పూల నాగరాజు, కె.కవిత, ఓరుగంటి నరేష్, కొండ్ర సంతోష్‌కుమార్, బండిగారి శ్రీనివాస్‌గౌడ్, ఎక్స్‌అఫీషియో సభ్యులు పూజారి ఎస్.అంబప్రసాద్ పాల్గొన్నారు.


జిల్లా దేవాదాయశాఖ ఏసీ చంద్రశేఖర్, ఈవో లావణ్యతో కలిసి ఆలయ పాలకమండలి నూతన చైర్మన్‌గా సత్యనారాయణరెడ్డి, ధర్మకర్తలు


అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం బత్తుల శ్రీనివాస్‌రెడ్డి

పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి

మన్సూరాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సకల సౌకర్యాలతో నాణ్యమైన విద్యను ఉచితంగా అందించే ప్రభుత్వ బడుల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని నాగోల్ డివిజన్ జైపురికాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో చిన్నారులు, వారి తల్లిదండ్రులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పరిసర ప్రాంత తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో సామాజిక సేవకులు సరస్వతి, ఉపాధ్యాయులు అనంతరెడ్డి, మేరి, అంగన్‌వాడీ టీచర్ లలిత, మేఘమాల పాల్గొన్నారు.

దివ్యాంగుల సహాయ ఉపకరణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఓల్డ్‌మలక్‌పేట : రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులు సంక్షేమ, సహకార సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉచితంగా సహాయ ఉపకరణాలు మంజూరు చేసింది. అర్హత కలిగిన దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని వికలాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ బి.శైలజ తెలిపారు. దివ్యాంగులు సంస్థ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్ తెరిచే ఉంది. ఈనెల 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ప్రతి లబ్ధిదారుడికి ఒక సహాయ ఉపకరణం మాత్రమే మంజూరు చేయబడుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారిని లేదా అసిస్టెంట్ డైరెక్టర్‌ను సంప్రదించవచ్చని కోరారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాటసింగారం వద్ద విజయవాడ జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై గుర్తు తెలియని మహిళ మృతిచెంది ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతురాలి వయస్సు సుమారు 50 సంవత్సరాలపై ఉంటుందని పోలీసులు తెలిపారు. మోకాళ్లకు కందిన గాయాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆమె స్థితిని బట్టి యాచకురాలిగా ఉందని అనారోగ్యంతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి వివరాలు తెలిస్తే పోలీసులను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


గుర్తు తెలియని మహిళ మృతదేహం

స్మార్ట్ పీడీఎఫ్‌తో కిటకిటలాడుతున్న రేషన్‌షాపులు

- గంటకు ఆరుగురి లబ్ధిదారులకు అందుతున్న రేషన్ సరుకులు
- గంటల తరబడి రేషన్‌షాపుల వద్ద పడిగాపులు.. కొట్టుకుంటున్న లబ్ధిదారులు
- తెల్లవారు జామున 4గంటల నుంచే షాపుల వద్ద క్యూలైన్

హయత్‌నగర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ పీడీఎఫ్ పేరుతో మూడు నెలల రేషన్ బియ్యం, గోధుమలు, చెక్కర ఒకేసారి ఇవ్వడానికి తీసుకువచ్చిన కొత్త సాఫ్ట్‌వేర్ లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తుంది. రేషన్ బియ్యాన్ని కొలిచే తూకం, బ్లూటూత్ కనెక్టు కాకపోవడం, సర్వర్ డౌన్ లాంటి సమస్యలతో లబ్ధిదారులు అటూ రేషన్ డీలర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. జూన్ 1వ తేదీ నుంచి సరుకులు ఇస్తున్నప్పటికీ రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులు బారులు తీరుతున్నారు. సాధారణంగా రేషన్ షాపులను ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 9గంటల వరకు తెరుస్తారు. రేషన్ డీలర్‌షాపు తెరవకముందే లబ్ధిదారులు తెల్లవారుజామున నాలుగు గంటలకు వచ్చి క్యూలైన్‌లో ఉంటున్నారు. కొందరైతే లైనులో ఉన్నట్లుగా ఒక వస్తువును గుర్తుగా పెట్టి ఇంటికి వెళ్లి పనులు చూసుకుంటున్నారు. వారి వంతు రాగానే వచ్చి సరుకులు తీసుకుంటున్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వ్యవధిలో కేవలం 35 నుంచి 40మందికి మాత్రమే రేషన్ సరుకులు ఇవ్వడానికి వీలు పడుతుందని పలువురు రేషన్ డీలర్లు తెలిపారు. రోజంతా కేవలం 90 నుంచి 100మంది లబ్ధిదారులకు మాత్రమే రేషన్ ఇస్తున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులు మాత్రం వందల్లో ఉంటున్నారు. ఒక దశలో లబ్ధిదారులు ఒకరిపైన ఒకరు దాడి చేసుకున్న సంఘటనలు సైతం హయత్‌నగర్‌లో వెలుగు చూశాయి. రెండు రోజుల క్రితం హయత్‌నగర్ కుంట్లూర్‌రోడ్డు, బంజారాకాలనీలోని రేషన్‌షాపుల వద్ద లబ్ధిదారులు గొడవపడ్డారు.



తెల్లవారుజామునే రేషన్‌షాపుకు చేరుకున్న లబ్ధిదారులు


కల్వంచ శాంతినగర్‌లోని రేషన్‌షాపుల వద్ద బారులు తీరిన లబ్ధిదారులు

తూకం, బ్లూటూత్ కనెక్టు కాకపోవడం, సర్వర్ డౌన్..?

తూకం, బ్లూటూత్ కనెక్టు కాకపోవడం, సర్వర్‌డౌన్ లాంటి సమస్యలు వస్తుండడంతో లబ్ధిదారులకు రేషన్ ఇవ్వడానికి జాప్యం జరుగుతుంది. తరుచూ సర్వర్ కావడం, లబ్ధిదారుల నుంచి మూడు నెలలకు సంబంధించిన తంబింగ్(వేలిముద్రలు) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సపరేటుగా తూకం వేయడం, గోధుమలు ఉంటే 9సార్లు, గోధుమలు లేకుంటే 6 సార్లు కాంటా వేయాల్సి రావడం, ఆ సమయంలో తూకం, బ్లూటూత్ కనెక్టు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. గత ఆరు రోజులుగా రేషన్ లబ్ధిదారులు రేషన్ షాపుల చుట్టే తిరుగుతున్నారు. ఒక్కో రేషన్‌షాపు వద్ద సుమారు రెండు వందల మంది లబ్ధిదారులు క్యూలైనులో ఉంటున్నారు. అందరికీ రేషన్ అందుతుందని చెప్పినా వినకుండా రేషన్ బియ్యం తీసుకోవడానికి లబ్ధిదారులు పోటీపడుతున్నారు.


రేషన్ బియ్యం తీసుకోవడానికి ఎగబడుతున్న లబ్ధిదారులు